ప్రజాశక్తి
శనివారం 18 మార్చి 2023
5
అల్లూరి సీతారామరాజు



30 నుంచి రాష్ట్ర స్థాయి క్రికెట్ టోర్నీ

ప్రజాశక్తి పాడేరు: పాడేరు మోదకొండమ్మ తల్లి ఉత్సవాల సందర్భంగా ఈనెల 30 నుండి రాష్ట్రస్థాయి మెగా క్రికెట్ టోర్నీ నిర్వహిస్తున్నట్లు టోర్నీ నిర్వాహకులు కొట్టగుళ్ళి సుబ్బారావు, అగతంబిడి రాజారావు, తాంగుల మహేష్, కొంటా దుర్గారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ టోర్నీలో గెలుపొందిన జట్లకు ప్రథమ బహుమతిగా రూ. 75 వేల నగదు, షీల్డ్, ద్వితీయ బహుమతి రూ.25 వేల నగదు, షీల్డ్ అందజేస్తామన్నారు. వీటితో పాటు టోర్నమెంట్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు వ్యక్తిగత బహుమతులు అందజేస్తామన్నారు. రాష్ట్రస్థాయిలో నిర్వహిస్తున్న ఈ క్రికెట్ టోర్నీను క్రికెట్ పీస్ బాల్‌తో నిర్వహిస్తామని చెప్పారు. ఈ టోర్నీలో పాల్గొనే క్రికెట్ జట్లు రూ. 3000 ఎంట్రీ ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ప్రతి క్రికెట్ జట్టు విధిగా యూనిఫాం, షూ ధరించాలని, కచ్చితంగా క్రికెట్ నిబంధనలు పాటించాలన్నారు. క్రికెట్ కిట్లు లేని జట్లకు నిర్వాహకులు సిద్ధంగా ఉంచుతామన్నారు. ఆసక్తి గల క్రికెట్ జట్లు ఈనెల 28లోపు తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. టోర్నీలో పాల్గొనేందుకు ఫోన్: 8500574489, 8309668683, 7382174966 నంబర్లకు సంప్రదించి జట్ల పేర్లను నమోదు చేసుకోవాలన్నారు.

మండలి విజేత తెలుగుదేశం

- -8 రౌండ్లలోనూ చిరంజీవిరావుదే ఆధిక్యం
- -సిట్టింగ్ బిజెపి ఎమ్మెల్సీ మాధవ్ సహా 34 మందికి డిపాజిట్ల గల్లంతు
- -పోస్టల్ బ్యాలెట్ సహా పోలైన ఓట్లు 2,13,035
- -లెక్కించిన ఓట్లు 1,89,017
- -అభ్యర్థి విజయానికి కావాల్సినవి 94,509
- -టిడిపికి వచ్చినవి 82,977 ఓట్లు- విజయానికి ఇంకా రావాల్సినవి 11,551
- -ఎలిమినేషన్ ప్రక్రియ చేపట్టిన ఎన్నికల అధికారులు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో: ఉత్తరాంధ్ర శాసన మండలి పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాన్ని తెలుగుదేశం పార్టీ దక్కించుకుంది. విజేతగా ఆ పార్టీ తరపున బరిలోకి దిగిన వేపాడ చిరంజీవిరావు నిలిచారు. ఈ నెల 16న ఉదయం 8 గంటల నుంచి ఎడతెరిపి లేకుండా 17వ తేదీ రాత్రి వరకూ మండలి ఓట్ల లెక్కింపును సుమారు 500 మంది సిబ్బంది చేపట్టారు. తెలుగుదేశం అభ్యర్థి వేపాడ చిరంజీవిరావు, వైసిపి అభ్యర్థి సీతంరాజు సుధాకర్ మధ్యనే ప్రధాన పోటీ నెలకొంది. పోలైన ఓట్లలో టిడిపి అభ్యర్థి వేపాడ చిరంజీవిరావుకు 82,977, సీతంరాజు సుధాకర్‌కు 55,749 ఓట్లు వచ్చాయి. పిడిఎఫ్ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ 35,148 ఓట్లతో మూడో స్థానంలో నిలిచారు. చిరంజీవిరావు విజయానికి ఇంకా 11,551 ఓట్లు అవసరం అధికారులు ఎలిమినేషన్ ప్రక్రియకు వెళ్లారు. 37 మంది అభ్యర్థుల్లో తక్కువ ఓట్లు వచ్చిన అభ్యర్థిని ఎలిమినేషన్ చేస్తూ అతనికి వచ్చిన ద్వితీయ ప్రాధాన్యతా ఓట్లను కలిపే దిశగా శుక్రవారం సాయంత్రం ఎన్నికల సిబ్బంది కసరత్తు ఆరంభించారు. అయితే ఓ న్యాయవాది వేసిన కేసు నేపథ్యంలో ఈ ఎమ్మెల్సీ ఎన్నిక ఫలితం తమకు లోబడి ఉండాలన్న హైకోర్టు తీర్పు నేపథ్యంలో విజేతను ఎన్నికల అధికారి ప్రకటిస్తారా ? లేదా ? అన్నదానిపై రకరకాల చర్చలు నడుస్తున్నాయి.

బిజెపికి డిపాజిట్ గల్లంతు

బిజెపి అభ్యర్థి పివిఎన్.మాధవ్‌కు 10,884 ఓట్లురాగా డిపాజిట్ గల్లంతైంది. 2017లో టిడిపి మద్దతుతో మాధవ్ బిజెపి తరపున ఉత్తరాంధ్ర పట్టభద్రుల శాసన మండలి ఎమ్మెల్సీగా గెలుపొందారు. అంతకు ముందు 2007, 2011 సంవత్సరాల్లో వరుసగా పిడిఎఫ్ అభ్యర్థి ఎంవిఎస్ శర్మ ఈ స్థానంలో గెలిచారు. 2023లో టిడిపి నేరుగా వేపాడ చిరంజీవిరావును బరిలోకి దించి ఆ సీటు దక్కించుకోవడం విశేషం.

గెలుపునకు కారణాలివే..

విశాఖలోని స్వర్ణభారతి ఇండోర్ స్టేడియంలో జరిగిన కౌంటింగ్ తొలి రౌండ్ నుంచీ టిడిపి అభ్యర్థే ఆధిక్యతను ప్రదర్శిస్తూ వచ్చారు. టిడిపికి జనసేనకు చెందిన పట్టభద్రులంతా ఈ ఎన్నికల్లో మద్దతుగా నిలిచి ఓట్లేశారు. అధికార పార్టీ వైసిపిపై ఉద్యోగ, ఉపాధ్యాయుల్లో వ్యతిరేకత కూడా టిడిపికి కలిసొచ్చింది. 20 ఏళ్లకు పైగా వేపాడ చిరంజీవిరావు ఆర్‌సి రెడ్డి కోచింగ్ సెంటర్, ఇతర కళాశాలల్లో ఎకానమీ లెక్చరర్‌గా కోచింగ్ ఇస్తూ పలువురు శిష్య బృందాన్ని తయారు చేసుకోవడంతో వారంతా ఈ ఎన్నికల్లో ఓటర్లను కలిసి ఆయన విజయానికి చేదోడుగా నిలిచారన్నది రూఢీ అవుతోంది.

వైసిపికి దెబ్బ

ఐదుగురు మంత్రులు, ఇద్దరు డిప్యూటీ సిఎంలు, ఆరుగురు ఎంపీలు, ఉత్తరాంధ్ర ఉమ్మడి జిల్లాలకు చెందిన ఎంఎల్ఏలు, ఇద్దరు ఎమ్మెల్సీలు, జిల్లాల సమన్వయ కమిటీల నేతలు కలిసినా కూడా వైసిపిని ఈ ఎన్నికల్లో గెలిపించుకోలేకపోయాయన్న విమర్శలను అధికార వైసిపి ఎదుర్కొంటోంది. పట్టభద్రుల ఎమ్మెల్సీ విషయంలో ఓట్లను సాధించడంలో పై చేయి సాధించలేకపోయారు. ఉపాధ్యాయులు, ఉద్యోగులు అధికార వైసిపికి దెబ్బ కొట్టారన్నది స్పష్టంగా తేలిపోయింది. ప్రభుత్వ వ్యరేతిక ఓటును అత్యధికంగా టిడిపి లాక్కోగలిగింది. ఎన్నికల బరిలోకి ఆలస్యంగా ఎంట్రీ ఇచ్చిన చిరంజీవి.. ఓట్ల నమోదులో కూడా గణనీయ పాత్రమీ పోషించలేదు. అయినప్పటికీ ఎమ్మెల్సీ స్థానంలో విజేతగా నిలవడం చూస్తే వైసిపి వ్యతిరేకత పట్టభద్రుల్లో ఎంత ఉందో వెల్లడవుతోంది. అనూహ్యమైన రీతిలో తెలుగుదేశం పార్టీ బరిలోకి దిగి ఈ స్థానాన్ని కైవసం చేసుకోగలిగింది. గతంలో గాడు చిన్న కుమారి లక్ష్మిని ఎమ్మెల్సీ అభ్యర్థిగా టిడిపి అధినేత చంద్రబాబునాయుడు బరిలోకి దింపారు. ఆమెను మార్చాలని ఆయనపై టిడిపి శ్రేణులు ఒత్తిడి తేవడంతో చిరంజీవిరావును బరిలోకి దింపి వ్యూహాత్మకంగా వ్యవహరించి విజయం సాధించారు.



టిడిపి అభ్యర్థి వేపాడ చిరంజీవి రావు

ప్రధాన అభ్యర్థులెవరేమన్నారంటే ?

తానే గెలవనున్నానన్న ధీమా తొలి నుంచీ ఉందని చిరంజీవిరావు తెలిపారు. ప్రభుత్వంపై వ్యతిరేకత తనను దెబ్బతీసిందంటూ వైసిపి అభ్యర్థి సీతంరాజు సుధాకర్ వెల్లడించారు.

ఓటర్లకు ధన్యవాదాలు : పిడిఎఫ్ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభ

విశాఖ కలెక్టరేట్ : మండలి ఎన్నికలలో తనకు ఓటు వేసిన వారందరికీ పిడిఎఫ్ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ ఓ ప్రకటనలో ధన్యవాదాలు తెలిపారు. పట్టభద్రుల ఎన్నికలను సాధారణ ఎన్నికల్లా రాజకీయ పార్టీలు మార్చేసినా.. ఎలాంటి ప్రలోభాలకూ లోనవకుండా 35 వేల మందికి పైగా పట్టభద్రులు మొదటి ప్రాధాన్యత ఓటును తనకు వేశారన్నారు. నిస్వార్థంగా ప్రచారంలో పాల్గొని, అహర్నిశలూ కృషి చేసిన ప్రజా సంఘాల కార్యకర్తలకు, నాయకులకు, శ్రేయోభిలాషులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.



శిశువును చూపుతున్న 108 సిబ్బంది

108లో గిరిజన మహిళ ప్రసవం

ప్రజశక్తి-రాజవొమ్మంగి

మండలంలోని వంచంగి గ్రామానికి చెందిన కోసూరి లోవకుమారి అనే గర్భిణికి పురిటినొప్పులు రావడంతో 108 వాహనంలో ఆసుపత్రికి తరలిస్తుండగా, మార్గమధ్యలో వాహనంలోనే ప్రసవించి పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చింది. కుటుంబ సభ్యుల తెలిపిన వివరాలు ప్రకారం... వంచంగి గ్రామానికి చెందిన గర్భిణి కోసూరి లోవకుమారికి నాలుగువ కాన్పుకు శుక్రవారం అధిక పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108 వాహనానికి సమాచారం ఇచ్చారు. 108 వాహనం గ్రామానికి చేరుకొని లోవకుమారిని ఏలేశ్వరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో గొంటువానిపాలెం గ్రామ శివారుకు వెళ్ళేసరికి పురిటి నొప్పులు మరింత ఎక్కువయ్యాయి. దీంతో 108 వాహనాన్ని రోడ్డు పక్కన నిలిపి 108 సిబ్బంది చింతపల్లి అర్జున్, ఆశ వర్కర్ కుమారి ప్రసవం చేశారు. లోవకుమారి పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చింది, లోవకుమారి ఇప్పటికే రక్త హీనతతో బాదపడుతుందని ఆశ వర్కర్ కుమారి తెలిపారు. డెలివరీ అనంతరం ఏలేశ్వరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం తల్లీ బిడ్డ క్షేమంగా ఉన్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా 108 సిబ్బందిని, ఆశ వర్కర్‌ను లోవకుమారి కుటుంబ సభ్యులు, గ్రామస్తులు అభినందించారు.

మోసపూరిత బడ్జెట్

- - ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధుల్లో కోత
- - ఉపాధి కల్పనకు నామమాత్రంగా కేటాయింపు
- - సిపిఎం జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స

ప్రజాశక్తి-అరకులోయరూరల్: అసెంబ్లీలో ప్రవేశ పెట్టిన బడ్జెట్ గిరిజన వ్యతిరేక బడ్జెట్ అని సిపిఎం జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స విమర్శించారు. శుక్రవారం అరకువేలి గిరిజన సంఘం కార్యాలయంలో మండల కార్యదర్శి కె.రామారావుతో కలిసి విలేకర్ల సమావేశంలో పి.అప్పలనర్స మాట్లాడుతూ,బడ్జెట్‌లో ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ అమలుకు కనీసం 25 శాతం నిధులు కేటాయించాల్సి ఉన్నా కేటాయించిన వాటిలో కూడా సగానికి సగం కోతలు పడుతున్నాయన్నారు. గత సంవత్సరం 20 వేల కోట్లు కేటాయించారని, సాధారణ పథకాలకు మళ్ళించారని తెలిపారు.గిరిజన సబ్ ప్లాన్ చట్టం ప్రకారం రూ.16140 కోట్లు కేటాయించాల్సి ఉందని, 10 వేల కోట్ల కోత విధించారన్నారు.కడప ఉక్కు పరిశ్రమ నిర్మాణానికి బడ్జెట్‌లో ప్రస్తావన లేదని అన్నారు. ఈ నిధులతో పోలవరం పునరావాసం, వెలిగొండ, హంద్రీనీవా ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పూర్తయ్యే జాడ లేదన్నారు. రాజధాని అమరావతి నిర్మాణానికి నిధుల ప్రస్తావన లేదని తెలిపారు. 4 ఏళ్ళ క్రితం చెప్పిన వాటిని పునశ్చరణ చేయడం తప్ప కొత్త పథకాలేవీ ప్రకటించలేదని విమర్శించారు. ఈ బడ్జెట్‌ను రాష్ట్ర ప్రజానీకం వ్యతిరేకించవలసిన అవసరం ఎంతైనా ఉందని చెప్పారు. ఉపాధి కల్పనకు, పారిశ్రామిక అభివృద్ధికి వెచ్చించింది నామమాత్రమే అని అన్నారు. కనీసం డిఎస్సీ పరీక్షలు పెడతామని, పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా ఇవ్వాల్సిన ఉద్యోగాలు ఇచ్చేందుకు ప్రతిపాదనలు ఈ బడ్జెట్‌లో ప్రస్తావన లేదన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా ఉపాధి కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం వాటా 10శాతం కింద రూ.500 కోట్లు కేటాయించాల్సి ఉందని, అటువంటి ప్రతిపాదనలేవీ బడ్జెట్‌లో లేవన్నారు.కేటాయించిన నిధులలో కూడా ఎక్కువ భాగం మెటీరియల్ కాంపొనెంట్‌కే వెచ్చించి కూలీలు చేసే పనికి కోత పెట్టారన్నారు. జగనన్న ఇళ్ళకు ఉపాధి నిధులను మళ్లించారన్నారు. గతంలో ప్రకటించిన నవరత్నాల కోసం తప్ప కొత్త రేషన్‌కార్డులు, పింఛన్ల మంజూరుకు కేటాయింపులు లేవని విమర్శించారు. తొలగించిన వేలాది మంది పించన్లు పునరుద్ధరణ చేయాలని డిమాండ్ చేశారు. 6 స్టెప్స్ ఫార్ములా చూపి పెన్షన్లు తొలగించడం దుర్మార్గమన్నారు. ఉన్నత విద్యకు నిధులు తగినంత లేవని అప్పలనర్స తెలిపారు.



మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి అప్పలనర్స



బుదరలో కూరుకుపోయిన బస్సును తోస్తున్న ప్రయాణికులు

జాతీయ రహదారిపై వాహనదారుల అవస్థలు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

మండలంలో 516ఇ జాతీయ రహదారి విస్తరణ పనులు జరుగుతుండగా, గురువారం రాత్రి నుంచి కురుస్తున్న వర్షానికి ఈ మార్గంలో రాకపోకలకు వాహనదారులు నానా అవస్థలు పడుతున్నారు. రహదారి విస్తరణ పనుల్లో భాగంగా వేసిన మట్టి వర్షం కారణంగా బురదగా మారింది. దీంతో దూసరపాము, తంటికొండ, సింగంపల్లి, జడ్డంగి తదితర ప్రాంతాల్లో వాహనదారులు శుక్రవారం రాకపోకలు సాగించే సమయంలో ప్రమాదాలకు గురయ్యారు. వాహనాల్లో మట్టి ఇరుక్కు పోవడంతో వాహనాలు ముందుకు నడవక నానా అవస్థలు పడ్డారు. ద్విచక్ర వాహనదారులు అనేకమంది వాహనదారులు ఈ రహదారిలో పడిపోవడంతో స్వల్పంగా గాయపడ్డారు. దీంతో వారి ప్రయాణం మధ్యలోనే ఆగిపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. బస్సులు, కార్లు, ఇతర ప్రైవేటు వాహనాలను తోయవలసిన పరిస్థితి ఏర్పడింది, వాహనదారులు ప్రయాణికులు ఇబ్బందుల నేపథ్యంలో సంబంధిత సిబ్బంది తక్షణం డైవర్షన్ ఏర్పాటు చేయాలని గిరిజన సంఘం మండల నాయకులు కొండ్ల సూరిబాబు, జె.రాజు, పాపారావు, సత్యనారాయణ తదితరులు డిమాండ్ చేశారు.



మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

రంపచోడవరం, చింతూరు డివిజన్లలో..

జిల్లా అధికారులు పర్యటించాలి

- జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

ప్రజాశక్తి-పాడేరు: రంపచోడవరం,చింతూరు డివిజన్లలో జిల్లా అధికారులు ప్రతి నెల పర్యటించాల్సిందేనని జిల్లా కలక్టర్ ఆదేశించారు. శుక్రవారం స్పందన అనంతరం హాజరైన అధికారులతో సమీక్షిస్తూ ఆ రెండు డివిజన్లలో కుడా నెలకు కనీసం మూడు రోజులు పర్యటించి దిగువ స్థాయి అధికారులతో సమీక్షలు నిర్వహించాలన్నారు. శాఖాపరంగా సమస్యలను పరిష్కరించాలని కలక్టర్ సూచించారు. స్పందనలో అందిన ప్రతి ఫిర్యాదు పరిష్కరించాలని కలక్టర్ ఆదేశించారు. ఫిర్యాదు అందిన వెంటనే ఒక విచారణాదికారిని నియమించాలని, అవసరమైతే సంబంధిత శాఖాధికారి వ్యక్తిగతంగా విచారణ జరిపి సమస్యలను పరిష్కరించాలని సూచించారు. స్పందనలో అందిన ఫిర్యాదులను, ఆర్థిక, ఆర్థికేతర అంశాలుగా విభజించి ఆర్థికేతర అంశాలను వెంటనే పరిష్కరించాలని సూచించారు. ఆర్థిక అంశాలు, పాలసీ విషయాలకు సంబంధించి తగు విచారణ జరిపి ఉన్నతాధికారులకు, ప్రభుత్వానికి నివేదించాలని సూచించారు. ఫిర్యాదుపై తగిన కారణం నమోదు చేసి ఫోటోలతో సహా వెబ్ పోర్టల్‌లో అప్లోడ్ చేయాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి కార్యాలయం నుండి స్పందన దరఖాస్తులను నిరంతరం సమీక్షిస్తున్న విషయాన్ని దృష్టిలో ఉంచుకొని పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. కోర్టు కేసులకు సంబంధించి వెంటనే కౌంటర్ ఫైల్ చేయాలని, తద్వారా వ్యక్తిగతంగా హాజరయ్యే అవకాశాలు తగ్గుతాయని సూచించారు. ఈ సమావేశంలో ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి రోణంకి గోపాలకృష్ణ, సబ్ కలక్టర్ వి.అభిషేక్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఆపదమిత్రల ద్వారా సహాయక చర్యలు

ఇఒపిఆర్ అండ్ ఆర్‌డి అసిస్టెంట్ కమిషనర్ కృష్ణమోహన్

ప్రజాశక్తి -రంపచోడవరం

రాష్ట్రంలో విపత్తుల సంభవించినప్పుడు సహాయక చర్యలు చేపట్టే విధంగా ఆపద మిత్రలను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసినట్లు రాష్ట్ర ఇఒపిఆర్ అండ్ ఆర్‌డి అసిస్టెంట్ కమిషనర్ కృష్ణ మోహన్ తెలిపారు. రంపచోడవరం యూత్ ట్రెనింగ్ సెంటర్లో 11 మండలాలకు సంబంధించిన వందమంది ఆపద మిత్ర వాలంటీర్లకు జరుగుతున్న శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విపత్తుల సంభవించినప్పుడు 15 శాఖల ద్వారా సహాయక చర్యలు చేపట్టే విధంగా ఒక్కొక్క శాఖ నుండి ఒక్కొక్క రోజు ఈ శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఇక్కడ ఇచ్చే శిక్షణ పూర్తిగా అవగాహన చేసుకొని వివిధ రకాలైన విపత్తులు సంభవించినప్పుడు ప్రజలకు సహాయం చేయాలని సూచించారు. ఈ శిక్షణ ఎవరికైనా అర్థం కాకుంటే మళ్లీ చెప్పమని అడగవచ్చున్నారు. ఈ కార్యక్రమంలో డిఎల్‌డిఓ కె.కోటేశ్వరరావు, డిఎల్‌పిఓ శ్రీనివాసరావు, ఎంపీడీవో ఎంవిఆర్.కుమార్‌బాబు, ఇఒపిఆర్‌డి జాన్ విల్సన్, డిపిఎం శ్రీనివాసరావు, ఈపిఎం కిరణ్మయి, ఆపదమిత్ర వాలంటీర్లు పాల్గొన్నారు.



శిక్షణలో పాల్గొన్న ఆపద మిత్రలతో రాష్ట్ర ఇఒపిఆర్ అండ్ ఆర్‌డి అసిస్టెంట్ కమిషనర్ కృష్ణమోహన్, అధికారులు



అసంపూర్తిగా ఉన్న అంగన్‌వాడీ కేంద్రం పరిశీలిస్తున్న జనసేన నాయకులు

అంగన్‌వాడీ కేంద్రం నిర్మాణాన్ని పూర్తి చేయరూ..

ప్రజాశక్తి- చింతూరు

చింతూరు మండల పరిధి, రత్నాపురం గ్రామంలోని అసంపూర్తిగా, అధ్వానంగా ఉన్న అంగన్వాడీ కేంద్రం భవనాన్ని జనసేన నాయకులు శుక్రవారం పరిశీలించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఏడు, ఎనిమిది సంవత్సరాల నుండీ అంగన్వాడీ కేంద్రాన్ని ఏ అధికారి పట్టించుకోలేదని తెలిపారు. ఐటిడిఎకు కూతవేటు దూరంలో ఉన్న రత్నాపురం గ్రామంలో అంగన్వాడీ కేంద్రం పరిస్థితిపై ఎన్నోసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఇంతవరకు పట్టించు కోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అంగన్వాడీ కేంద్రం నిర్మాణం పూర్తి చేయకపోవడంతో చిన్నారులు కింద దుమ్ములో కూర్చొని, అక్కడే తిని అక్కడే ఆడుకునే పరిస్థితి నెలకొందని పేర్కొన్నారు. అంగన్వాడీ టీచర్ స్వయంగా సొంత సొమ్ముతో ఒక గదికి తలుపు ఏర్పాటు చేసుకుని, సామాగ్రి భద్రపరచాల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. సత్వరమే అసంపూర్తిగా ఉన్న భవనాన్ని పూర్తి చేయాలని, సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షులు మడివి రాజు, నాయకులు తీగల రవి, దుర్గారావు, స్థానికులు కన్నారావు, సుబ్బారావు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-చింతూరు

చింతూరు ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు, మినీ అంగన్వాడీ కార్యకర్తల పోస్టుల భర్తీకి అర్హుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐసిడియస్ ప్రాజెక్టు సిడిపిఓ పి.విజయ గౌరి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నరసింహపురంలో అంగన్వాడీ కార్యకర్త, బండి గుంపు, ఎంసిడి క్యాంపు, కొండపల్లి గ్రామాల్లో మినీ అంగన్వాడీ కార్యకర్తలు, గూడూరు, ఎన్.నరసింగపేట, కారం గూడెం గ్రామాల్లో ఆయా పోస్టుల భర్తీకి జిల్లా కలెక్టర్, ప్రాజెక్ట్ డైరెక్టర్ ఆదేశాల మేరకు నోటిఫికేషన్ విడుదల చేసినట్లు వెల్లడించారు. ఈనెల 17 నుండి 24వ తేదీ సాయంత్రం ఐదు గంటల లోపు సంబంధిత శిశు అభివృద్ధి పథకం అధికారికి నేరుగా గాని, పోస్ట్ ద్వారా గాని దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. స్థానిక గ్రామ స్థిర నివాసిరాలైన వివాహిత, గిరిజన మహిళలు మాత్రమే ఈ పోస్టులకు అర్హులని పేర్కొన్నారు. 2023 జులై 1 నాటికి 21 నుండి 35 సంవత్సరాల లోపు వయస్సు కలిగి, కనీసం పదవ తరగతి ఉత్తీర్ణులై ఉండాలని తెలిపారు. 21 సంవత్సరాల పైబడిన అభ్యర్థులు లభించని పక్షంలో 18 సంవత్సరాలు పూర్తయిన వారి దరఖాస్తులను కూడా పరిశీలిస్తామని వెల్లడించారు. ఎంపికలో పదవ తరగతి ఉత్తీర్ణతకు 50 మార్కులు, ప్రీ స్కూల్ టీచర్ ట్రైనింగ్, ఇంటర్మీడియట్, డిగ్రీ పూర్తిచేసిన అభ్యర్థులకు ఐదు మార్కులు, వితంతువులకు ఐదు మార్కులు, మైనర్ పిల్లలు కలిగి ఉన్న వితంతువులకు ఐదు మార్కులు, పూర్తి అనాథ, క్రెచ్, హోమ్, ప్రభుత్వ సంస్థలలో నివసించు సత్ప్రవర్తన సర్టిఫికెట్ కలిగిన వారికి 10 మార్కులు, వికలాంగ వ్యక్తులకు ఐదు మార్కులు, మౌఖిక పరీక్షకు 20 మార్కులు, మొత్తం 100 మార్కులకు లెక్కించబడుతుందని పేర్కొన్నారు. ఈ మార్కుల ఆధారంగా పూర్తి పారదర్శకతతో నియామకాలు జరుగుతాయని తెలిపారు. అభ్యర్థులు మధ్యవర్తులను, దళారులను నమ్మి మోసపోవద్దని హితవుపలికారు.

మారేడుమిల్లి : మండలంలోని గుజ్జు మామిడి వలస పంచాయతీ పరిధి ఉత్తలూరు గ్రామంలో ఖాళీగా ఉన్న మినీ అంగన్వాడీ కార్యకర్త, చావడికోట పంచాయతీ బొడ్లంక గ్రామంలో ఖాళీగా ఉన్న ఆయా పోస్టు భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మారేడుమిల్లి మండల సిడిపిఓ లక్ష్మీ ప్రసన్న శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 17 నుండి 24వ తేదీ సాయంత్రం ఐదు గంటల వరకు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు.



ర్యాలీ చేపడుతున్న వైద్య సిబ్బంది

క్షయ వ్యాధిపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి-హుకుంపేట: టిబి వారోత్సవాల్లో భాగంగా మండలంలోని ఉప్ప ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి ఉప్ప జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించారు. క్షయ వ్యాధి ని నిర్మూలిద్దాం దేశాన్ని కాపాడుదాం అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎంటటిసి టిబి వైద్య అధికారి అనూష మాట్లాడుతూ, క్షయ వ్యాధిని అంత మొందించడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. గతంలో కన్నా టిబి పై అవగాహన కల్పించడంతో గ్రామాల్లో తగ్గుముఖం పట్టిందని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిహెచ్ఇఒ సన్యాసిరావు, హెల్త్ సూపర్వైజర్ మోహన్‌రావు పాల్గొన్నారు.

8న 'రన్ ఫర్ జీసస్'

ప్రజాశక్తి-అడ్డతీగల

గుడ్ ఫ్రైడే, ఈస్టర్ సండే మధ్య వచ్చే శనివారం ఏప్రిల్ 8న రన్ ఫర్ జీసస్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు రన్ ఫర్ జీసస్ రంప చోడవరం డివిజన్ అడ్డతీగల కో-ఆర్డినేటర్ ఆరోగ్య రాజు తెలిపారు. మండల కేంద్రంలోని బెయేర్షెబా ప్రేయర్ హౌస్‌లో శుక్రవారం ఆరోగ్య రాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో రన్ ఫర్ జీసస్ కార్యక్రమానికి ఏర్పాట్లు గురించి రెవరెండ్ ఏ.రాజ్ కుమార్, సీయోను బాబు, కె.జ్ఞాన భూషణం, సిస్టర్ ఎంఎల్ ఇవాంజిలిన్‌తో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరాధన ఛానల్ ద్వారా గత 12 సంవత్సరాలుగా నిర్వహించబడుతున్న రన్ ఫర్ జీసస్ కార్యక్రమాన్ని అడ్డతీగలలో ఈ ఏడాది కూడా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఏప్రిల్ 8న ఉదయం 7 గంటలకు అడ్డతీగల-ఏలేశ్వరం మార్గంలో గల ఎలక్ట్రికల్ సబ్ స్టేషన్ వద్ద ప్రారంభించి, సీతపల్లి సెంటర్, ఆర్టీసీ బస్టాండ్, కార్పెంటర్ కాలనీ పంచాయతీ ఆఫీసు, అల్లూరి సీతారామరాజు కాలనీ, 99 బిల్డింగ్స్, గాంధీ బొమ్మ సెంటర్, అడ్డతీగల మెయిన్ రోడ్లు గుండా ఈ పీస్ ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. అడ్డతీగల పరిసర ప్రాంతంలోని అన్ని సంఘాల సేవకులను, విశ్వాసులను కలుపుకొని ఈ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. వచ్చిన వారికి అల్పాహారం, భోజనాలు ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు.

గొందిపాడులో వైద్యశిబిరం



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

ప్రజాశక్తి- జి.మాడుగుల: మండలంలో సోలభం పంచాయతీ గొందిపాడు గ్రామంలో శుక్రవారం ఫ్యామిలీ ఫిజియన్‌లో భాగంగా వైద్యులు రోబ్యా సోం దొర ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపు నిర్వహించారు. పలువురు గర్భిణీలకు పరీక్షలు చేసి మందులు అందజేశారు. తీసుకోవలసిన జాగ్రత్తలు, సలహాలు వివరించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని, వేడి చేసి చల్లార్చిన మంచినీటిని తాగాలని తెలిపారు. సూపర్వైజర్ సత్యనారాయణ, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాలు ఏర్పాటు



ఏర్పాటు చేసిన స్తంభం

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: మండల కేంద్రంలో కొత్త విద్యుత్ స్తంభాలను అధికారులు ఏర్పాటు చేస్తున్నారు. ఏడు స్తంభాలు శిథిలావస్థకు చేరడంతో గుర్తించి వాటి స్థానంలో కొత్త స్తంభాలను ఏర్పాటు చేస్తున్నామని సచివాలయ లైన్‌మెన్ నిరంజన్ తెలిపారు. భవిష్యత్తులో ఎటువంటి ప్రమాదాలకు తావివ్వకుండా ఉండాలనే ముందస్తు జాగ్రత్తలో భాగంగా ఈ స్తంభాలను ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన చెప్పారు. కొత్త స్తంభాలను ఏర్పాటు చేస్తుండటంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు.

ఉపాధి హామీ పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్

ప్రజాశక్తి -పెదబయలు రూరల్ :మండలంలోని పరైద పంచాయతీ పరైద గ్రామంలో స్థానిక సర్పంచ్ చెండా రవి శంకర్ ఉపాధి హామీ పథకం పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత కొన్ని సంవత్సరాల నుండి శ్మశాన వాటికకు రహదారి సౌకర్యం లేదని, పలుమార్లు అధికారులకు వినతి పత్రాలు ఇచ్చినా గతంలో స్పందించ లేదన్నారు. ఈ ఏడాది మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామి కింద సుమారుగా 78 లక్షల తో పిఆర్ రోడ్డు నుండి శ్మశానం వరకు సుమారుగా 200 మీటర్ల దూరం పనులు కల్పిస్తామని, గ్రామస్తులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో సచివాలయం సెక్రటరీ లలితా కుమారి, విఆర్‌పి పార్వతి, ప్రసాదరావు, టెక్నీకల్ అసిస్టెంట్ పి.చంద్రకళ, మేట్ జయసుధ పాల్గొన్నారు.

త్వరితగతిన స్పందన సమస్యల పరిష్కారం



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్, ఇతర అధికారులు

జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్... 28 వినతులు స్వీకరణ

ప్రజాశక్తి-పాడేరు టౌన్ : పాడేరు ఐటిడిఎలో శుక్రవారం నిర్వహించిన స్పందనకు 28 ఫిర్యాదులు అందాయి. జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, ఐటిడిఎ పిఒ రోణంకి గోపాలకృష్ణ, సబ్ కలెక్టర్ వి.అభిషేక్ వివిధ మండలాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. అర్జీలను సంబంధిత అధికారులకు అందజేసి త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. పాడేరు మండలం దుమ్మపుట్టు, వల్లాపురం గ్రామాల పరిధిలో మూడు వందల ఎకరాల సాగుభూమి ఉండని చెక్ డ్యాం నిర్మించి సాగునీటి కల్పించాలని సర్పంచ్ సదుపాయం కె.సన్యాసిబాబు, పాడేరు మండలం వనుగుపల్లి పంచాయతీ బెర్లగొంది గ్రామానికి ఉపాధి హామీ పథకంలో మట్టి రోడ్డు నిర్మించారని వర్షాకాలంలో ఇబ్బందులు పడుతున్నామని సిసి రోడ్డు నిర్మించాలని గ్రామస్తులు ఎస్.రమేష్ బాబు, ఎస్.రామారావు తదితరులు వినతి పత్రం సమర్పించారు. పెంతపల్లి మండలం చౌడుపల్లి పంచాయతీ వామగెడ్డ గ్రామంలో జియోటవరు నిర్మించాలని గ్రామస్తులు కె.బాలకృష్ణ, ఎస్.నాగరాజు వినతి పత్రంలో కోరారు. ఈ కార్యక్రమంలో డిడబ్ల్యు డిడి ఐ.కొండలరావు, డిఎంహెచ్‌ఓ జమాల్ భాషా, టిడబ్ల్యు ఇఇలు డివిఆర్ఎం రాజు, కె.వేణుగోపాల్, పిఆర్ ఇఇ కొండయ్యపడాల్, పిఐయు ఇఇ కె.లావణ్య కుమార్, ఆర్ డబ్ల్యుఎస్ ఇఇ లీలాకృష్ణ, డిడిఒ కొండలరావు, డిఎల్ పిఒ పిఎస్ కుమార్, డిఇఒ భాషా, ఐసిడిఎస్ పిడి సూర్యలక్ష్మి పాల్గొన్నారు.

నిద్రలేమితో అనారోగ్య సమస్యలు

డాక్టర్ ఫణీంధ్ర, కన్సల్టెంట్ పల్మనాలజిస్ట్, కిమ్స్ ఐకాన్ ఆసుపత్రి

నేడు అంతర్జాతీయ నిద్ర దినోత్సవం



డాక్టర్ ఫణీంధ్ర

ప్రజాశక్తి - గాజువాక : మనిషి జీవితంలో సగ భాగమైన నిద్రకు ఎంతో ప్రాముఖ్యత ఉందని కిమ్స్ ఐకాన్ కన్సల్టెంట్ ఫల్మనాలజిస్ట్ డాక్టర్ ఫణీంద్ర అన్నారు. సరిపడా నిద్ర లేకుంటే శారీరక, మానసిక రుగ్మతలు, అనారోగ్య సమస్యలు ఉత్పన్నమౌతాయని హెచ్చరించారు. ఏటా మార్చి మూడవ శుక్రవారం నిర్వహించే అంతర్జాతీయ నిద్ర దినోత్సవం సందర్భంగా నిద్ర ప్రాముఖ్యత, నిద్ర లేమితో వచ్చే వివిధ అనారోగ్య సమస్యలపై అవగాహన కల్పించడమే ముఖ్యోద్దేశ్యమన్నారు.

సగటు మనిషి జీవితం కాలంలో సుమారు 26ఏళ్ల నిద్రకు, మరో ఏడేళ్ల నిద్రలోకి జారుకోవడానికే సరిపోతుంది. అనేక ఆరోగ్య సమస్యలు నిద్రతోనే ముడిపడి ఉన్నాయి. నిద్రలేమితో అధికరక్తపోటు, మధుమేహం, ఊబకాయం, పక్షావాతం, హృద్రోగం వంటి శారీరక సమస్యలతోపాటు మానసిక సమస్యలు వచ్చే అవకాశం ఉందన్నారు. ప్రపంచ జనాభాలో 45శాతం మంది నిద్ర సమస్యలతో బాధపడుతుండగా, వీరిలో మూడో వంతుమంది మాత్రమే వైద్యులను సంప్రదిస్తున్నారని పరిశోధనా నివేదికలు వెల్లడిస్తున్నాయన్నారు.

నిద్రకు సంబంధిత జబ్బులలో స్లీప్ ఆప్నియా చాలా ముఖ్యమైనది. స్లీప్ ఆప్నియా ఉన్న వారికి ప్రధానంగా గురక, నిద్రలో ఊపిరి ఆగి మెలుకువ రావడం, పగలు అతి నిద్ర, నీరసం, తలనొప్పి వంటి లక్షణాలు ఉంటాయి. పాలీ సోమ్నోగ్రఫీ (నిద్ర పరీక్ష) ద్వారా ఈ సమస్యను గుర్తించవచ్చు. సిపిఎపి థెరపీ, బరువు తగ్గడం, కొన్ని రకాల శస్త్రచికిత్సల ద్వారా చికిత్స చేయవచ్చునని తెలిపారు.

ఇవీ తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- ★ ప్రతిరోజూ ఒకే సమయానికి నిద్రపోవడం, నిద్ర లేవడం ద్వారా ఆరోగ్యానికి మంచిది.
- ★ రాత్రి వేళ తేలికగా జీర్ణమయ్యే ఆహారం తొందరగా తినేయాలి.
- ★ కాఫీ, టీ ఎక్కువగా తాగడం, మద్యపానం, ధూమపానం నిద్ర లేమి, నిద్ర సమస్యకు కారణమౌతాయి. వాటిని మానుకోవాలి.
- ★ నిద్రపోయేందుకు కనీసం రెండుగంటల ముందే మొబైల్, కంప్యూటర్, టీవీ నుంచి వచ్చే బ్లూలైట్‌కు దూరంగాఉండాలి.
- ★ క్రమం తప్పకుండా నిర్దిష్ట వ్యాయామం చేయాలి. అతి వ్యాయామం, జిమ్ మంచిది కాదు.
- ★ రాత్రి నిద్ర పోయే ముందు తేలికపాటి నడక, ధ్యానం చేయడం, సంగీతం వినడం మంచిది.
- ★ పగటిపూట 45 నిమిషాలకు మించి నిద్ర పోరాదు.పడక గది వాతావరణం తాజా గాలి వచ్చేలా, నిశ్శబ్ధంగా అనుకూలంగా ఉండాలి
- ★ మానసిక ఆందోళనను కలిగించే విషయాలు రాత్రిపూట నిద్ర సమయంలో చర్చించడం మంచిది కాదు.
- ★ నిద్రలేమి గురక, ఆయాసం వంటి సమస్యలుంటే వెంటనే పల్మనాలజిస్ట్ లేదా స్లీప్ స్పెషలిస్ట్‌ని సంప్రదించి చికిత్స చేయించుకోవాలి..

అంతర వైద్య కళాశాలల పోటీలకు గీతం క్రికెట్ జట్టు ఎంపిక

ప్రజాశక్తి- మధురవాడ : వైఎస్ఆర్ హెల్త్ వర్సిటీ ఆధ్వర్యంలో ఈనెల 20 నుంచి 24వరకు తిరుపతి శ్రీ.వెంకటేశ్వర మెడికల్ కాలేజీలో నిర్వహించే అంతర వైద్య కళాశాలల క్రికెట్ పోటీలలో పాల్గొనే గీతం దంత వైద్యకళాశాల జట్టును ఎంపిక చేసినట్లు గీతం దంత వైద్యకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీతారామరాజు తెలిపారు. షేక్ ఇషాక్ మదీనా కెప్టెన్‌గా వ్యవహరించే జట్టులో సభ్యులుగా ఎ.భాగ్యకిరణ్, ఎన్‌పి.సాహు, ఎన్.జోనాధన్, జి.గోపి, కె.భరత్‌కుమార్, ఎ.దినేష్, పి.సాయి వెంకట కృష్ణ, ఎస్.శ్రీసాత్విక్, తిరుమల రెడ్డి రఘురామరెడ్డి, ఎన్.సునీల్, ఎ.వరహసాయి శ్రావణ్‌కుమార్, డి.వెంకట రఘువర్ధన్, బి.రోహిత్, వై.వంశీకుమార్‌లను ఎంపిక చేశారు. జట్టు మేనేజర్, కోచ్‌గా డాక్టర్ జయలక్ష్మి వ్యవహరిస్తారని ప్రిన్సిపల్ తెలిపారు.



గీతం దంతకళాశాల క్రికెట్ జట్టు

రోజంతా చిరు జల్లులు



సీలేరులో కురుస్తున్న చిరుజల్లులు

ప్రజాశక్తి -సీలేరు: ఉపరితల ఆవర్తనం, ద్రోణి కారణంగా జీకే వీధి మండలం సీలేరు పరిసర ప్రాంతాల్లో శుక్రవారం రోజంతా చిరు జల్లులు కురిశాయి. ఉదయం ఆకాశం మేఘావృతమై మబ్బులతో కూడా వాతావరణం నెలకొంది. ఉదయం ఎనిమిది గంటలు నుంచి సాయంత్రం వరకు చిరుజల్లులతో కూడిన వర్షం కురిసింది. దీంతో సీలేరు పరిసర ప్రాంతాల్లో చల్లటి వాతావరణ నెలకొంది. చల్లటి చిరుగాలులు వీశాయి. ఆంధ్ర ఒరిస్సా సరిహద్దు ప్రాంతంలో కూడా రోజంతా వర్షం కురిసింది. ఏఓబి సరిహద్దు ప్రాంతాల్లో వర్షం కారణంగా దినసరి కూలీలు అనేక అవస్థలు పడ్డారు. వర్షం కారణంగా సీలేరులో విద్యార్థులు పాఠశాలలకు వెళ్లేందుకు ఇబ్బందులకు గురయ్యారు.

డుంబ్రిగూడ: మండలంలో శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు పిడుగుల శబ్దాలతో వర్షం కురిసింది. వేసవి ప్రారంభం నుంచి ఎండలబ తీవ్రత ఎక్కువగా ఉండటంతో ఇబ్బంది పడిన మండల వాసులకు ఈ వర్షంతో వాతావరణం చల్లబడడంతో కొంత ఉపశమనం కలిగించింది. వర్షంతో పాటు చల్లటి గాలులు విస్తుండటంతో గిరిజనులు జలుబు, దగ్గు వంటి అనారోగ్యాలకు గురవుతున్నారు. మండలంలో శుక్రవారం జరిగిన అరకు వారపు సంత పూర్తిగా బురదమయంగా మారడంతో సంతకు వచ్చిన గిరిజనులు, కొనుగోలుదారులు, వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.

జి.మాడుగుల: మండల కేంద్రంతోతో పాటు పలు గ్రామాల్లో బోరున వర్షం కురిసింది. రైతులు అప్రమత్తమై పసుపు, మిరియాల పంటలు వర్షం ధాటికి దెబ్బ తినకుండా తగు జాగ్రత్తలు తీసుకున్నారు.

దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి -అనంతగిరి:మండలంలోని అనంతగిరి ప్రాజెక్టు పరిధి పలు అంగన్వాడి కేంద్రంలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ టీచర్, ఆయా పోస్టులకు దరఖాస్తులు ఈనెల 17వ తేదీ నుండి ఈనెల 24వ తేదీ వరకు స్వీకరిస్తున్నట్లు ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారిణి సంతోష కుమారి పేర్కొన్నారు. అర్హులైన గిరిజన అభ్యర్థులు కనీసం 10వ తరగతి ఉత్తీర్ణత కలిగిన వారు దరఖాస్తులు సమర్పించాలని ఆమె పేర్కొన్నారు



పిజి సెట్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న విసి ప్రసాదరెడ్డి

ఎయులో ఎపి పిజి సెట్ కార్యాలయం

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : రాష్ట్రవ్యాప్తంగా పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే ఎపి పిజిసెట్ కార్యాలయాన్ని ఆంధ్రవిశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం విసి పివిజిడి ప్రసాదరెడ్డి, ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ ఎన్.కిశోర్‌బాబు ప్రారంభించారు. అనంతరం కన్వీనర్ ఆచార్య ఎన్.రమణయ్యకు వీసీ ప్రసాదరెడ్డి పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. ప్రభుత్వం అప్పగించిన బాధ్యతను సమర్ధవంతంగా నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య కె. సమత, ప్రిన్సిపాల్స్ ఆచార్య వై. రాజేంద్ర ప్రసాద్, టి.శోభశ్రీ, జి.శశిభూషణరావు, ఎస్‌కె భట్టి, వి. విజయలక్ష్మి, డీన్ ఆచార్య భాస్కర రెడ్డి పాల్గొన్నారు.



స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ పెట్టనున్న ఆర్‌టిసికి చెందిన ఐదు అంతస్తుల భవనం

ఆర్‌టిసి భవనంలో 'స్కిల్' సెంటర్..!

- పుష్కర కాలం తర్వాత అందుబాటులోకి రానున్న భవనం

- పదేళ్ల లీజుకు ఒప్పందం కుదుర్చుకున్న చమురు సంస్థలు

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం) : విశాఖ నగర నడిబొడ్డున ఉన్న ఆర్‌టిసికి చెందిన భవనాన్ని అత్యవసరంగా ముస్తాబు చేస్తున్నారు. పుష్కరకాలంగా నిరుపయోగంగా ఉన్న ఈ భవనానికి తాజాగా మరమ్మతులు చేపట్టి, తుది మెరుగులు అద్దుతున్నారు. విశాఖ ద్వారకా బస్ కాంప్లెక్స్‌లో ఆర్‌టిసికి బహుళ అంతస్తుల భవనం ఉంది. ఐదు అంతస్తులతో విశాలమైన ప్రాంగణాలతో దీనిని నిర్మించారు. కొన్ని అంతస్తులను పలు అవసరాలకు వినియోగించారు. మిగిలిన వాటిని అద్దెకు ఇచ్చారు. ఈ భవనానికి ముందు పలు వాణిజ్య సముదాయాలు రావడంతో దీని డిమాండ్ తగ్గిపోయింది. ఒకప్పుడు ఈ భవనం ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల కార్యాలయాలతో కళకళలాడుతూ ఉండేది. పుష్కర కాలం నుంచి ఖాళీగా ఉంది. నిర్వహణ లేక శిథిలావస్థకు చేరుకుంది. గతంలో ఖాళీగా ఉన్న ఆ బిల్డింగ్‌ను అద్దెకు తీసుకోవడానికి పలు సంస్థలు, ఆసుపత్రుల యాజమాన్యాలు ఆసక్తి కనబరిచాయి. కానీ భవనం కింద ఫ్లోర్‌లో వాణిజ్య దుకాణాలు, దక్షిణం వైపున ద్వారకా బస్ స్టేషన్, ఉత్తరం దిక్కులో ఓ పెద్ద జ్యూయలరీ షాపు ఉన్నాయి. దీంతో ఈ పెద్ద భవనానికి పార్కింగ్ సదుపాయం లేకుండా పోయింది. ఫలితంగా పార్కింగ్ సమస్య వల్ల ఇన్నాళ్లూ ఇది నిరుపయోగంగా ఉంది. ప్రస్తుతం ఈ భవనంలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటుకు భారతీయ చమురు సంస్థలు సంయుక్తంగా ముందుకొచ్చాయి. ఐఒసిఎల్, హెచ్‌పిసిఎల్, బిపిసిఎల్, ఒఐఎల్, ఒఎన్‌జిసి తదితర చమురు సంస్థలు తమ సిఎస్ఆర్ నిధులతో దేశంలోని వివిధ నగరాలలో నైపుణ్య కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో విశాఖలో స్కిల్ సెంటర్ ఏర్పాటు కోసం ఆర్‌టిసి భవనాన్ని ఎంపిక చేసుకున్నాయి. ఈ సెంటర్‌కు వచ్చే వారు విద్యార్థులే కావడంతో పార్కింగ్ సదుపాయం అంతగా అవసరం ఉండదు. నగర నడిబొడ్డున, రవాణా సదుపాయం ఉన్న ఈ భవనం స్కిల్ సెంటర్ ఏర్పాటుకు అణువుగా ఉంటుందన్న ఉద్దేశంతో చమురు సంస్థలు లీజు ఒప్పందం కుదుర్చుకున్నాయి. ఈ సెంటర్ నిర్వహణ బాధ్యతను విశాఖ హెచ్‌పిసిఎల్ చూసుకోబోతున్నట్టు తెలుస్తోంది.

ఒప్పందం ఇలా..

ద్వారకా బస్ స్టేషన్ స్థలంలో దాదాపు 4 దశాబ్దాల క్రితం ఆర్‌టిసి నిర్మించిన ఈ ఐదంతస్తుల భవనం విస్తీర్ణం సుమారు 84 వేల చదరపు అడుగులు. ఈ భవనానికి చదరపు అడుగుకు నెలకు రూ.13.89 చొప్పున అద్దె చెల్లించేలా చమురు సంస్థలతో ఒప్పందం కుదిరింది. ఈ లెక్కన అద్దె ద్వారా ఆర్‌టిసికి నెలకు రూ.11.60 లక్షల ఆదాయం సమకూరనుంది. ఈ భవనం లీజు ఒప్పందం పదేళ్ల పాటు ఉంటుంది. ఈ నేపథ్యంలో అవసరమైన పనులు మొదలు భవనాన్ని చమురు సంస్థలకు అప్పగించడానికి ఆర్‌టిసి యాజమాన్యం టెండర్లు పిలిచింది. టెండర్ దక్కించుకున్న సంస్థ ఇప్పటికే పనులు ప్రారంభించింది. విద్యుత్ సదుపాయం, నీటి సరఫరా, డ్రెయినేజీ వంటి వాటిని సమకూర్చడంతో పాటు అవసరమైన పనులు మొదలు పెట్టారు. మరో 4, 5 నెలల్లో ఈ భవనం అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది.

రాంగోపాల్ వర్మ వ్యాఖ్యలు దారుణం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో దర్శకుడు రాంగోపాల్ వర్మ చేసిన అసహ్యకర, దిగజారుడు వ్యాఖ్యలను ఎఐడిఎస్‌ఒ నాయకులు హరీష్ కుమార్ రెడ్డి, మహేష్ ఖండించారు. ఈ మేరకు వారు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. తనను తాను జంతువుగా ప్రకటించుకొన్న రాంగోపాల్ వర్మను ఆధునిక ఫిలాసఫర్ అని వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ రాజశేఖర్ చెప్పడం దారుణమని పేర్కొన్నారు.

జగనన్నను నమ్మని పట్టభద్రులు

మండలి ఎన్నికల్లో అధికార పార్టీకి కోలుకోలేని దెబ్బ

'ఎంట్రీ' ఆలస్యమే అయినా పక్కా ప్లాన్‌తో చిరంజీవిరావు

పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో అధికార పార్టీకి రాలని ఓట్లు



కౌంటింగ్ కేంద్రం నుంచి బయటకు వస్తున్న వైసిపి అభ్యర్థి సీతంరాజు సుధాకర్

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

ఉత్తరాంధ్ర పట్టభద్రులు జగనన్నను నమ్మలేదని తాజా మండలి ఫలితాలు వెల్లడిస్తున్నాయి. ఉత్తరాంధ్ర శాసన మండలి పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తాము గెలుపొందితే.. విశాఖను రాజధానిగా చెయ్యాలనే తమ పార్టీ ప్రతిపాదనకు ఓటర్లు ఆమోద ముద్ర వేసినట్టేనని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహా ఉత్తరాంధ్ర జిల్లాల ప్రాంతీయ సమన్వయకర్త వైవి.సుబ్బారెడ్డి, మంత్రులు గుడివాడ అమర్‌నాథ్, బొత్స వంటి నేతలు గడిచిన కొన్ని రోజులుగా చేస్తున్న ప్రకటనలకు ఈ ఓటమితో గట్టి దెబ్బ తగిలింది. శుక్రవారం వెలువడ్డ మండలి ఫలితాల్లో వైసిపి రెండో స్థానంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. విశాఖ నగరం, విజయనగరం, శ్రీకాకుళం, అనకాపల్లి వంటి పట్టణాల్లోనూ అధికార పార్టీకి ఎదురీత తప్పలేదు. విశాఖలోని ఉత్తరం, పశ్చిమ నియోజకవర్గాల్లో మినహా మిగతా చోట్ల నాయకులెవరూ పట్టించుకున్న పాపాన పోలేదన్న సమీక్షలు వైసిపిలో ప్రారంభమయ్యాయి. మొత్తం 8 రౌండ్లలో ఏ రౌండ్‌లోనూ వైసిపి లీడింగ్‌లోకి వెళ్లలేని గడ్డు స్థితి ఎదుర్కొంది. అధికారంలో ఉన్న చోట ఉప ఎన్నికలు, ఇలాంటి ఎన్నికల్లో సాధారణంగా పై చేయి అధికార పార్టీకి ఉంటుందన్నది తెలిసిందే. రాష్ట్రంలో 2019 నుంచీ ఉపాధ్యాయ, ఉద్యోగులపై కక్ష సాధించే ధోరణితో ఉన్న జగన్‌పై పట్టభద్రులు కూడా అసమ్మతిగానే ఉన్నారన్నది ఈ ఫలితం ద్వారా చూడొచ్చన్నది రాజకీయ విశ్లేషకుల మాట. వైసిపి శ్రేణుల నుంచీ ఇదే వినిపిస్తోంది. సిపిఎస్ అమలు, డిఎల ఎగవేత, ఉపాధ్యాయులను వేధించే విధానాలు కూడా వైసిపిని ముంచాయి.

అధికారంలో వైసిపి ఉండడంతో ఆ పార్టీకి ఆ మాత్రమైనా ఓట్లు రాలాయని పలువురు అంటున్నారు. అత్యధిక మంది యువకులు ఈ ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ప్రభుత్వ విధానాలపై విసిగి వేసారిన వారంతా టిడిపికే ఓటు వేశారన్నది తెలుస్తోంది. అలాగే పట్టభద్ర యువతలో జనసేన పట్టభద్రులూ ఉన్నారు. చిరంజీవిరావు కోచింగ్ సెంటర్లలో శిక్షణ పొందిన వారూ ఉన్నారు. వీరు పలువురు పట్టభద్రులను ఓటు వేయించేందుకు ఉమ్మడి ఉత్తరాంధ్ర జిల్లాల్లో వాహనాల్లో పోలింగ్ బూత్‌లకు సైతం తీసుకు వచ్చినట్టు తెలుస్తోంది. ఇవన్నీ టిడిపి అభ్యర్థికి ప్లస్ పాయింట్‌గా ఉన్నాయి.

వైసిపి అభ్యర్థి సీతంరాజు సుధాకర్ పలు నియోజకవర్గాల్లో నాయకులతో సమావేశాలు నిర్వహించడం.. శాలువాలు, పూలదండలు వేదికలపై వేయించుకోవడం మినహా పట్టభద్రులను నేరుగా కలవలేదు. ఆ పార్టీ ముఖ్య నాయకులదీ అదే తీరు. వీటికి తోడు పట్టభద్ర ఓటర్లలో ప్రభుత్వ వ్యతిరేకత కూడా తోడై ఓటమి చెందారన్నది తెలుస్తోంది. ఈ ఉత్సాహంతో వచ్చే సాధారణ ఎన్నికల్లోనూ రాష్ట్రంలో అధికారం మాదే అంటూ టిడిపి శ్రేణులు ఆనందం వ్యక్తం చేస్తున్నాయి.

ఛాట్-బాట్ పోర్టల్‌కు విశేష స్పందన

రూ.40 లక్షల విలువైన 200 మొబైల్ ఫోన్లు కనుగొన్న నగర పోలీసులు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖ నగర పోలీస్ కమిషనర్ సి.హెచ్.శ్రీకాంత్ ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఛాట్-బాట్ వెబ్ పోర్టల్‌కు సెల్ ఫోన్లు పోగొట్టుకున్నవారి నుంచి విశేష స్పందన లభిస్తోందని క్రైమ్ డిసిపి గంధం నాగన్న తెలిపారు. శుక్రవారం సాయంత్రం నగర పోలీస్ కమిషనర్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో ఈ పోర్టల్ ద్వారా ఫిర్యాదు చేసుకున్న వారికి వంద సెల్ ఫోన్లను పోలీసులు రికవరీ చేసి అందజేశారని తెలిపారు. సిటీ పోలీస్‌కి చెందిన సిసిఎస్ బృందం టెక్ సెల్ డేటా సహాయంతో అన్ని సాంకేతిక కోణాల్లో విశ్లేషించి రాష్ట్రం లోపల, వెలుపల ఉన్న వివిధ ప్రదేశాలలో బాధితులు పోగొట్టుకున్న మొబైల్‌లను కనుగొన్నామన్నారు. ఢిల్లీ, రాజస్థాన్, కేరళ, తమిళనాడు, ఒడిశా, తెలంగాణ రాష్ట్రాల్లోని తిరుపతి, గుంటూరు, పశ్చిమగోదావరి, తూర్పుగోదావరి, శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాల్లోని ప్రజలు పోయిన మొబైల్‌లను ఉపయోగిస్తున్నట్లు గుర్తించామన్నారు. అనంతరం సిసిఎస్ పోలీసులు దొంగతనం చేసిన మొబైల్ వినియోగదారులతో మాట్లాడి వారి నుంచి మొబైల్స్ స్వాధీనం చేసుకున్నారని తెలిపారు. ఈ క్రమంలో వివిధ ప్రాంతాల నుంచి సుమారు రూ.40 లక్షల విలువైన 200 మొబైల్స్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా సెల్ ఫోన్లు పోగొట్టుకున్న వారు ఛాట్ బాట్‌లో ఎలా ఫిర్యాదు చేయాలి ? ఆ ఫిర్యాదులను సాంకేతిక పరిజ్ఞానం సాయంతో పోలీసులు ఎలా విచారిస్తారు ? బాధితులకు ఎలా అందజేస్తారు ? అన్న విషయాలపై అవగాహన కల్పించారు. దయచేసి ఎవరూ దొంగ ఫోన్లు కొనవద్దని విజ్ఞప్తి చేశారు.



రికవరీ చేసిన మొబైల్ ఫోన్లతో పోలీసులు



దీక్షలో కూర్చున్న ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు

'ఉక్కు' పరిరక్షణ కోసం మంత్రులకు వినతులు

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

రాష్ట్రాభివృద్ధిలో కీలకపాత్ర పోషించిన వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను పరిరక్షించుకునేందుకు త్వరలో కేంద్ర మంత్రులకు వినతిపత్రాలు సమర్పించనున్నట్టు విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నేతలు తెలిపారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు శుక్రవారానికి 764వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో స్టీల్ ఎస్ఎంఎస్ - 1 విభాగానికి చెందిన కార్మికులు కూర్చున్నారు. వారినుద్దేశించి పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ, సిఐటియు స్టీల్ జోన్ గౌరవాధ్యక్షులు జె.అయోధ్యరాం, పోరాట కమిటీ నాయకులు శ్రీనివాస్, రామకృష్ణ మాట్లాడారు. త్వరలోనే ఢిల్లీ వెళ్లేందుకు కార్మిక నేతలంతా సిద్ధమైనట్టు వెల్లడించారు. ఉక్కు ప్రైవేటీకరణపై కేంద్ర ప్రభుత్వ ప్రకటనల నేపథ్యంలో పరిరక్షణ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయనున్నామన్నారు. తమ పోరాటానికి రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలతో పాటు ప్రజానీకమంతా మద్దతునివ్వాలని విజ్ఞప్తి చేశారు.

ప్రభుత్వంపై వ్యతిరేకత స్పష్టమైంది

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : పట్టభద్రుల ఎన్నికల్లో ప్రభుత్వ వ్యతిరేకత స్పష్టంగా కనిపించిందని మాజీ మంత్రి, విశాఖ ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం ఉదయం స్వర్ణ భారతి ఇండోర్ స్టేడియం వద్ద ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో టిడిపి అభ్యర్థులను విజయపథాన నిలిపిన గ్రాడ్యుయేట్ ఓటర్లకు ధన్యవాదాలు తెలిపారు. తమ అభ్యర్థిని ఫిబ్రవరి ఒకటిన ప్రకటించామని, తక్కువ వ్యవధిలోనే మంచి విజయం సాధించామని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో ఇదే ధోరణి కొనసాగుతుందని తెలిపారు. ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలకుండా చూడాలని పవన్ కల్యాణ్ చెప్పిన విషయం ఈ ఎన్నికల్లో రుజువైందని అన్నారు. రాజధాని వ్యవహారం సహా వైసిపి చెప్పిన మాటలను ప్రజలు నమ్మలేదన్నారు.

మాధవ్‌కు ఘోర పరాభవం

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం ఎన్నికల్లో సిట్టింగ్ ఎమ్మెల్సీ, బిజెపి అభ్యర్థి మాధవ్‌కు డిపాజిట్ కూడా దక్కలేదు. అతనికి 10,884 ఓట్లు వచ్చాయి. అతనికి వచ్చిన ఓట్లు కంటే చెల్లని ఓట్లే ఎక్కువగా ఉండటం గమనార్హం. ఈ ఎమ్మెల్సీ స్థానానికి పోలైన ఓట్లలో చెల్లని ఓట్లు 12,318గా ఉన్న విషయం తెలిసిందే. ఈ ఎన్నికల్లో బిజెపి అభ్యర్థి మాధవ్‌కు కనీస ఓట్లు రాకపోవడం వెనుక స్టీల్ ప్రైవేటీకరణ అంశం, కేంద్ర ప్రభుత్వ విధానాలు గట్టిగా ప్రభావం చూపాయని పలువురు అభిప్రాయపడుతున్నారు.

టెన్త్ మోడల్ టెస్ట్ ఫలితాలు విడుదల

ప్రజాశక్తి-నక్కపల్లి:నక్కపల్లి, ఎస్.రాయవరం మండలం లో భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో జరిగిన టెన్త్ క్లాస్ మోడల్ టెస్ట్ ఫలితాలను శుక్రవారం నక్కపల్లి సిఐటియు కార్యాలయంలో ఎస్ఎఫ్ఐ నాయకులు విడుదల చేశారు.ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఎం.రమణ మాట్లాడుతూ, పరీక్షలంటే విద్యార్థుల్లో భయాందోళన పోగొట్టడానికి, వారిలో ఉన్న ప్రతిభను వెలుగు తీసేందుకు గాను పదో తరగతి విద్యార్థులకు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో టెన్త్ క్లాస్ మోడల్ టెస్ట్ నిర్వహించామన్నారు. ఈ మోడల్ టెస్ట్‌లో సుమారుగా 17 స్కూల్ నుండి 730 మంది విద్యార్థులు పాల్గొన్నట్లు తెలిపారు. మొదటి స్థానంలో ఎస్ నాగసాయి ప్రవీణ్ (శ్రీ ఆదర్శ స్కూల్), రెండవ స్థానం పి.బేబీ (విశ్వశాంతి హైస్కూల్), మూడవ స్థానం జి బిందు (గర్ల్స్ హైస్కూల్ ,నక్కపల్లి) స్థానాల్లో నిలిచినట్లు పేర్కొన్నారు. ప్రతిభ కనబరిచిన 15 మంది విద్యార్థులకు ఈనెల 20న బహుమతుల ప్రధాన చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బి.బాబ్జీ, జిల్లా సహాయ కార్యదర్శి ఎం.బాలాజీ పాల్గొన్నారు.